క్లుప్తంగా

నేడు అందుబాటులో ఆమంచి

పర్చూరు (చినగంజాం): పర్చూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ప్రజలకు అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపింది.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కారంచేడు: కారంచేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, అన్ని శాఖల అధికారులు తమ శాఖల పూర్తి ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం ప్రజా సమస్యలపై స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్ వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు స్పందన, మధ్యాహ్నం నుంచి వీఆర్‌ఓల సమావేశం నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు సచివాలయ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నేతాజీ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

స్పందనకు అధికారుల హాజరు తప్పనిసరి

యద్దనపూడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తహశీల్దార్ వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందనకు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అభివృద్ధి పనుల వివరాలు, సచివాలయాల సమాచారంతో విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కృష్ణకుమారి కోరారు.

ఆరోగ్యవంతమైన జీవనం అవసరం

నాగులుప్పలపాడు: ప్రస్తుత రోజుల్లో మనిషి ఆరోగ్యం కోసం ఎంతో వెచ్చించాల్సి వస్తోందని ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ అన్నారు. ఆరోగ్య ఉప్పుగుండూరు అనే కార్యక్రమం ద్వారా రసాయనిక ఎరువులతో పండించిన కూరగాయలు తినకుండా గ్రామస్తులు తమకు తామే సొంతంగా సహజసిద్ధంగా కూరగాయలు పండించుకోవాలన్న సంకల్పంతో చేపట్టిన ఉచిత కూరగాయలు, ఆకు కూరల విత్తనాల పంపిణీ కార్యక్రమం రెండో విడతను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 వేల రూపాయల విలువ చేసే 10 రకాల ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను దాతల సహకారంతో 200 మందికి ఉచితంగా అందజేశారు. ప్రతిఒక్కరూ సేంద్రియ ఎరువులతో వీటిని పండించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు ప్రసాద్, కొంజేటి జలంధర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, షేక్ మీరా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్రం స్పందించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ శాంతారావు, గ్రామస్తులు

అల్లూరు (కొత్తపట్నం): మణిపూర్‌లో ఇప్పటికీ జరుగుతున్న హింసాత్మక ఘటనలపై కేంద్రం స్పందించాలని అల్లూరు ఎంపీటీసీ, కళాకారుడు మిట్నసల శాంతారావు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మృతిచెందిన వారికి ఆదివారం అల్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ మణిపూర్‌లో అత్యంత అవమానంగా మహిళలపై ప్రవర్తించిన తీరు దారుణన్నారు. కేంద్రం జోక్యం చేసుకుని హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్బారావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రం మెతక వైఖరితో మణిపూర్‌లో హింస



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



బల్లికురవలో పాస్టర్ల శాంతి ర్యాలీ

వేటపాలెం: మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే చోటు చేసుకుంటున్నాయని క్రైస్తవ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గత రెండు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం వేటపాలెంలోని అన్ని క్రైస్తవం సంఘాల ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. దేశాయిపేట పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రామానగర్ మీదుగా వేటపాలెం గడియార స్తంభం సెంటర్ వరకు సాగింది. సెంటర్‌లోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మణిపూర్‌లో దాడులను ఆరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని నినా దాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు సత్యం బాబు, చార్లెస్ ఫిన్నీ మాట్లాడుతూ క్రైస్తవులపై కక్షపూరితంగా దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దొరికిన వారిని దొరికినట్లుగా చంపేస్తున్నారని, మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ అత్యాచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సభ్య సమాజంలో పుట్టిన ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడతారా అని ప్రశ్నించారు. కులమతాలు వేరైనా అందరూ సమానమేనన్నారు. అందరూ భారతీయులమేని ఇటువంటి చర్యల వలన ప్రపంచ దేశాల్లో దేశం అప్రతిష్టపాలవుతోందని చెప్పారు. ఇప్పటికైన కేంద్రం ప్రభుత్వం స్పందించి మణిపూర్ దాడులకు కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షలు విధించాలని కోరారు. పాస్టర్లు టి. కాలేబు, ఏ. భాస్కర రావు, సెంథిల్ కుమార్, జి. బాబు, బి. ఆంద్రెయ, పి. వెంకట్రావు, చిరంజీవి, ప్రేమ్‌కుమార్, రాజు, మార్పు గ్రెగోరీ, చేగూడి సురేష్‌బాబు, శేషుబాబు, దాసు, ప్రకాష్, పి. వెంకట్రావు పాల్గొన్నారు.

మారణకాండ చేసిన వారిని శిక్షించాలి

అద్దంకి రూరల్: మణిపూర్ మారణకాండ బాధితులను కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు మందా జోసప్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ బాపట్ల జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని శింగరకొండ పాలెంలో యెహోవా ఈరే ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నక్కా కాంతారావు మాట్లాడుతూ దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామ చేయాలన్నారు. సంఘకాపరి సంపంగులు చంద్రయ్య పాల్గొన్నారు.

బల్లికురవ: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మండల పాస్టర్‌ల అధ్య



ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు

క్షుడు తంగిరాల తిమోతి కోరారు. ఆదివారం బల్లికురవలో తెలుగు బాపిస్టు చర్చి నుంచి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ మానవ హారం చేపట్టారు. గత రెండు నెలలుగా మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బల్లికురవ చర్చి పాస్టర్ సురేష్ మాట్లాడుతూ ఈ దాడులకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. క్రైస్తవులపై కావాలని కక్ష పూరితంగా దాడులకు పాల్పడటం, మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ అత్యాచారాలకు పాల్పడటం, సభ్యసమాజంలో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడతారా అని ప్రశ్నించారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి శాంతి

పర్చూరు (చినగంజాం): సమాజంలో జరుగుతున్న వ్యక్తుల అక్రమ రవాణా పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని పర్చూరు పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి అన్నారు. ఆదివారం వ్యక్తుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రపంచ దినోత్సవం సందర్భంగా పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో నాగులపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి పి. శాంతి మాట్లాడుతూ వ్యక్తుల అక్రమ రవాణా ఎదుర్కోవాలన్నారు. మనకు సంరక్షణ ఏర్పరుచుకోవాలని, పరిచయం లేని వ్యక్తులతో ఎటువంటి సంభాషణలు చేయకూడదని, మనకు మంచి ఎవరు చేస్తారు, చెడు దృష్టితో ఎవరు చూస్తున్నారు అని గ్రహించాలని సూచించారు. చెడు వ్యక్తులకు దూరంగా మెలగాలని బాలికలకు హితవు పలికారు. మనం ఎక్కువగా నమ్మేవాళ్ళే మనలను మోసం చేసే అవకాశం ఉంటుందని మన వ్యక్తిగత బలహీనతలను ఎవరికీ చెప్పకూడదన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి 15 మంది బాలికలు మిస్సవుతున్నారని, మొదటి ఆరు గంటల్లో మాత్రమే వారిని కనిపెట్టే అవకాశం లభిస్తుందని చెప్పారు. 24 గంటలు దాటితే ఎన్ని ప్రయత్నాలు చేసినా మిస్సయిన వారిని కనిపెట్ట లేక పోతున్నారని కనుక దీనిని గ్రహించి బాలికలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఓ లక్ష్యం ఏర్పరుచుకొని దానిని చేరడానికి కష్ట పడాలని హితబోధ చేశారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఉంటాయని.. ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని తెలియజేశారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ పి. విశ్వరాణి అధ్యక్షతన నిర్వహించగా వైస్ ప్రిన్సిపాల్ పి. స్వర్ణలత వందన సమర్పణతో ముగిసింది. 540 మంది విద్యార్థినులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పర్చూరు పోలీస్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

కోడూరివారిపాలెంలో విశ్వగురు సేవా కార్యక్రమం



భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విశ్వగురు సేవకులు, భక్తులు

చినగంజాం: మండలంలోని పెదగంజాం పంచాయతీ కోడూరివారిపాలెం గ్రామంలోని రామాలయంలో ఆదివారం విశ్వగురు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమం నిర్వహించారు. సనాతన, హిందూ ధర్మ అభివృద్ధి కోసం, ఐశ్వర్యాభివృద్ధి కోసం విశ్వగురు కార్యక్రమం చేశారు. సేవ చేసేందుకు సేవకులు వాయల వెంకటేశ్వర్లు, చెంచమ్మ దంపతులు, మరుప్రోలు చిన్నబ్రహ్మారెడ్డి, పూన్నారావు, కవిత దంపతులు, మాచవరపు సుధాకర్ హాజరు కాగా, కార్యక్రమంలో గుడి పూజారి, గ్రామ కాపులు, పెద్దలు, గ్రామ సంకీర్తన బృందం పాల్గొన్నారు.

రూ. 1 కోటితో డ్రైనేజీ నిర్మాణం

ఒంగోలు: కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద నుంచి గోరంట్ల కాంప్లెక్స్ వరకు ఈ డ్రెయిన్ నిర్మాణం జరుగుతోంది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బాలినేని అధికారులను ఆదేశించారు. ఈ డ్రెయిన్ పూర్తయితే పలు ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు పోతురాజు కాలువలో కలవడం జరుగుతుందని తెలిపారు. తద్వారా ఇక్కట్లు తొలగిపోతాయన్నారు. ఎమ్మెల్యే వెంట నగర మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్, నగర నాయకులు కటారి శంకర్, గంటా రామానాయుడు, ఎండేటి రంగారావు, గండు మధు, తాళ్లపాలెం శ్రీను, రావులపల్లి శ్రీకాంత్, సత్యన్నారాయణరెడ్డి, జఫ్రుల్ల తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన సేవలు అందించాలి

ఒంగోలు అర్బన్: పేద ప్రజలకు తగ్గింపు ధరలతో మెరుగైన సేవలు అందించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్టార్ ఎంఆర్‌ఐ సెంటర్ నిర్వాహకులను కోరారు. స్థానిక సుందరయ్య భవనం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ ఎంఆర్‌ఐ సెంటర్‌ను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి బాలినేని ప్రారంభించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఎంఆర్‌ఐ సెంటర్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికే స్టార్ మూడు కేంద్రాలను ప్రారంభించి సేవలందిస్తోందని, ఇంకా అభివృద్ధి చెంది పేదలకు సేవలందించాలని కోరారు. ప్రారంభానికి వచ్చిన అతిథులను స్టార్ ఎంఆర్‌ఐ యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

గిరిజన బాలురకు కాస్మెటిక్స్ పంపిణీ



విద్యార్థులకు కాస్మెటిక్స్ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

వేటపాలెం: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పూరా మస్తాన్‌రావు, శివ రాజకుమారి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోప్‌లు, పేస్ట్‌లు, కొబ్బరినూనె, డిటర్జెంట్ సోప్‌లు, దోమల మ్యాట్‌కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ మస్తాన్ రావు, శివరాజ కుమారి, స్వామి రాఘవేంద్ర, ప్రేరక్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు రామానుజం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేతిపంపు ఇలా.. నీరు ఎలా?



చేతిపంపుపై నుంచే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వినియోగంలో లేని పంపు

చీరాల టౌన్: మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీ సాయికాలనీలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డుకు మంచినీటి పంపు అడ్డుగా వచ్చిందేమో కానీ....షాలో బోర్‌ను అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో మంచినీటిని పట్టుకునేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చేనేతలు, రోజువారీ కూలీలు అధికంగా నివసించే సాయి కాలనీ గ్రామంలోని ప్రజలు తాగునీటికి షాలో బోర్లనే వినియోగిస్తుంటారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డును సైతం చేతిపంపు వినియోగంలోకి లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వీలునామాలో జాగ్రత్తలు తప్పనిసరి



రమేష్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చీరాల అర్బన్: సీనియర్ సిటిజన్స్ వీలునామాలు తమ వారసులకు రాసే సమయంలో తగు జాగ్రత్తలు, న్యాయపరమైన అంశాలు తెలుసుకొని వారసులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రమేష్‌బాబు అన్నారు. ఆదివారం చీరాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు సీనియర్ పౌరుల పోషణ సంక్షేమ చట్టం 2007 లోని ప్రధాన అంశాలు తెలుసుకోవాలన్నారు. వృద్ధుల చట్టాలని ప్రభుత్వం కఠినంగా అమలు పరచాలని అసోసియేషన్ అధ్యక్షులు గాదె హరిహరరావు అన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగవీరభద్రాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.యల్లమందారెడ్డి, కార్యదర్శి ఎ.రామారావు, కోశాధికారి దశరథరామయ్య, మణిబాబు, జీవీ ప్రసాదరావు, గోర్నల శివప్రసాద్, వెంకటరావు పాల్గొన్నారు.

యాత్రలతో ప్రపంచ విజ్ఞానం



మాట్లాడుతున్న కృష్ణమోహన్

వేటపాలెం: ప్రపంచ యాత్రల ద్వారా విజ్ఞానం లభిస్తుందని హెచ్‌ఎం ఎం. కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రోబస్ క్లబ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాత్రల ద్వారా ఆయా దేశాల్లో సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానాలు తెలుస్తాయన్నారు. క్లబ్ అధ్యక్షుడు అవుల పున్నయ్య, కార్యదర్శి సూసం షణ్ముఖేశ్వరరావు, ఉపాధ్యక్షులు పనామా లోహియా, కోశాధికారి బీరక సుబ్రహ్మణ్యం, స్వర్ణ ప్రయాగరావు, వలేటి సుబ్బారావు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణా అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మోటుమాల (కొత్తపట్నం): బాలికల అక్రమ రవాణాను అరికట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రవికుమార్ కోరారు. బాలికల అక్రమ రవాణా నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోటుమాల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బాలికలు అక్రమ రవాణాకు గురికాకుండా ఉండాలంటే బాగా చదువుకుని అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. డ్రాపౌట్ కాకుండా చదువు పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వాలు విద్యార్థినులకు ఎన్నో సదుపాయాలు, పథకాలు, రిజర్వేషన్లు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని చదువులు పూర్తి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తల్లిదండ్రులను ఆదేశించారు. చిన్న వయసులో వివాహాలు జరిగితే ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయని వివరించారు. బాగా చదువుకుని జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం బాలికల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లక్ష్మి, రాజేష్, సుమన్ హబీబా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు టౌన్: ఒంగోలు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రంగరాయుడు చెరువు వద్ద కేక్ కట్ చేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మార్నెళ్ల సుబ్బారావు, తదితరులు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చిన బంధాల కంటే మనం ఏరికోరి చేసిన స్నేహం జీవితాంతం ఉంటుందని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా తోడుగా నిలిచే స్నేహితుడు దొరకడం అదృష్టమని మరో సభ్యుడు అడపా జనార్దన్ తెలిపారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిపోయినా ఇప్పటికీ మనసారా పలకరించేది మిత్రుడే అని కృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో సభ్యులు నైనాల వేణుగోపాల్, శ్రీనివాసరెడ్డి, చౌదరి, నాగూర్, బాబూరావు, మద్ది ఈశ్వర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

2న మండల సమావేశం

బల్లికురవ: బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖలవారీగా ఈ సమీక్షతోపాటు మండలంలోని సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులు సర్పంచ్‌లు మండస్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు అద్దంకి పురపాలక సంఘ సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నారు. ఈమేరకు పురపాలక సంఘ చైర్మన్ లక్కెబోయిన ఎస్తేరమ్మ ఆదివారం తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న దంపతులు, భక్తులు

ఒంగోలు మెట్రో: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక త్యాగరాజ మందిరంలో సామూహిక రమా వసుంధర సమేత సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. వ్రత కథ ఆధ్యాత్మిక రహస్యాన్ని రాజయోగి బ్రహ్మకుమార్ మంజునాథ్ వ్రతంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు వివరించారు.

శ్రీగిరి ఆలయ ధర్మకర్త మృతి

ఒంగోలు టౌన్: నగరంలోని శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, నీరజా ట్రాన్స్‌పోర్టు అధినేత ఆలూరు వేంకట రమణారావు (70) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. టీటీడీ ధార్మిక సలహా మండలి జిల్లా అధ్యక్షునిగా, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు ప్రకాశం, గుంటూరు జిల్లాల కో ఆర్డినేటర్‌గా కూడా ఆయన సేవలందించారు. వేదవిద్య వ్యాప్తికి తోడ్పాటు అందజేశారు. తన సంస్థల ద్వారా అనేక మందికి ఉపాధి కల్పించారు. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు చేయూత అందించారు. ఆలూరి అంత్యక్రియలను మంగళవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆలూరి ఆకస్మిక మరణంపై కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ అధిపతి సిద్ధేశ్వరానంద భారతీస్వామి సంతాపం ప్రకటించారు. ఆలూరి భౌతికకాయాన్ని ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు సందర్శించి నివాళి అర్పించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ పూర్వ కార్యదర్శి డా.చిలకపాటి విజయ రాఘవాచార్యులు, డాక్టర్ గంజాం శ్రీనివాసమూర్తి, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, వి.నాగేశ్వరశాస్త్రి, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు నెమాని సీతారామమూర్తి, చిమలమర్రి వెంకట సుబ్బారావు, పోన్నటూరి శ్రీనివాసఫణి, ఆలయ అర్చకులు, వేదపండితులు, నీరజా ట్రాన్స్‌పోర్టు సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు. ఆలయ కార్యనిర్వాహక ధర్మకర్త సీవీ కృష్ణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు తదితరులు ఆలూరు వేంకట రమణారావు ధార్మిక సేవలను గుర్తు చేసుకున్నారు.